


# 8 దాచింపాడు రోడ్డు కథ

"రేపట్నుంచీ గొడుగేసు కొస్తావుండు" అన్నాడు రామిరెడ్డిగారు – మర్నాడు సుబ్బరాజు రాగానే.

సుబ్బరాజు పైకి చూశాడు.

"అబ్బే మబ్బేసిందని గాదు. వర్షాలయిపోయాయి. ఇపుడు ఎలక్షను మానిఫెస్టో లొస్తున్నాయిగా? ఇహ మంచి ఫిబ్రవరి దాకా వాగ్దానాల వర్షాలు కురుస్తాయని. గొడుగేసుకోపోతే నెత్తి బొప్పి కడద్ది" అంటూ తన చమత్కారానికి విరగబడి నవ్వారు రెడ్డిగారు. కణతలుబ్బి ముఖం కందగడ్డలా – పడమట అస్తమిస్తున్న సూర్యబింబంలా ఎర్రబారిపోయింది. సుబ్బరాజు వినయంగా రెడ్డిగారి గౌరవార్థం మందహాసం చేశాడు.

"నిన్నటి పత్రిక చూశావా? కొత్త ఎలక్షను వరాల్లో పల్లెటి దిక్కుల రోడ్లేయించడం ఒకటిట. ఎలాటి మారుమూల పల్లెకయినా బస్తీనుంచి పెద్ద రోడ్ల మీంచి దారిపోయిస్తారుట. ఏమంటావు బాగుందా?" అన్నారు రెడ్డిగారు స్థిమితపడ్డాక.

"ఊహ మంచిదే" అన్నాడు సుబ్బరాజు.

"మరే, అంతే, ఊహే మంచిది. దాచింపాడు పంచాయితీ కథ విన్నావుగా?"

"లేదు"

"విను....దాచింపాడు కాపేరెలా వచ్చిందో శానామందికి తెలీదు. నాకూ తెలీదనుకో. బ్రిటిష్ హయాములో ఇండిపెండెంటు వీరుల్ని పోలీసుల కందకుండా తెచ్చి దాచింది. కాబట్టి ఆ పేరొచ్చిందని ఆయనెవడో పుస్తకంలో ఒసార్రాశాడు. అదికాదూ, ఆ పల్లెటి ప్రజలే ఆ వూరిని దాచేసుకుని తాము దాంకున్నారని గిట్టనివాళ్ళు విసుర్లిసిరారు. ప్రజలు కాదు సర్కారు వాళ్ళే దీన్ని దాచేశారని దేశమంతటా ఒక్క లాగు బాగుపడి ఎల్ట్రిలైట్లతో, కంకరరోడ్లతో, ఆసుపత్రులతో, బళ్ళతో, గుళ్ళతో యిదయిపోతోంది గాబట్టే పూర్వకాలం దేశం ఎలాగ, యెంత వెనుకబడుందో తెలుసుకుందుకు, అనాక ఎపుడైనా ఏ దొరైనా సరదాపడితే చూపించేందుకు, పాతకారు పల్లెటూళ్ళు కాసిని దాచి అట్టే పెట్టాలన్న ఊహకొద్దీ కొన్నిటిని వెనకేశారనీ, వాటిలో ఈ దాచింపాడు ఒకటనీ ఒకాయన చెప్పాడు. అంతెందుకు? ఈడ బడిచెప్పటానికీ, ఆసుపత్రి కారు పంపడానికీ, రేడియో పెట్టడానికీ ఇంకా అభివృద్ధి పన్లంటారే అవన్నీ చేయడానికి

బ్లాకువాళ్ళు రాలేదని ఎవరో అడిగితే ఓ మినీస్టర్గారు ఆశ్చర్యపడి ఆఫీసు రికార్డులో వాకబు చేయించారు. దాచింపాడు పేరెక్కడా కనబళ్ళేదట."

"ఎమ్మెల్లేగారూ, ఎమ్మెల్లేగారూ బలేవాడివయ్యా. బలే తమాషాచేసి నన్ను కంగారు పెట్టావే!? రికార్డులన్నీ చూశాము. అసలు దాచింపాడనే ఊరే లేదటయ్యా. పేరూ ఊరూ లేకుండా దీన్నెలా డవలప్మెంటు జేయమంటావు?" అవటాని కడిగేశాడు. ఎమ్మెల్లేగారు నిర్ఘాంతపోయాడు. ఇదేమిటీ? దాచింపాడు మా అత్తారూరయితే, మీరు లేదంటారూ? మీ రికార్డుల్లో కెక్కకపోతే ఇహనా ఊరులేనట్టేనా అన్నాడు. కాని అప్పటికే అందరూ గట్టిగా నవ్వుతున్నందువల్ల ఆ గొడవలో ఈ మాటలెవరికీ వినబళ్ళేదనుకో.

మొత్తానికి దాచింపాడునంతా కలిసి నాటికీ నేటికీ అలాగే దాచి ఉంచారు. చుట్టుపక్కల ఉన్న ఊళ్ళకూ దాచింపాడుకూ దారి అని చెప్పకోదగ్గదేం లేదు. ఎట్నుంచి వెళ్ళినా పొలాల కడ్డుపడో కాలవలీదో వెళ్ళాలి. ఏం? బురదపాడు మేజరు పంచాయితీ వేపు నుంచి మాత్రం మట్టిదారిలాటి దోటి పోశారు. ఆ దారంట బళ్ళు వెళ్ళవు. వెళ్ళొచ్చే మణుసులు అసాధ్యులయినందువల్ల వాళ్ళకు బాధలేదు. ఆ దారి తొక్కడం అలవాటయిన వాళ్లు తిరుపతి కొండలకు షికారెళ్ళినట్లెల్లి సునాయాసంగా తిరిగొస్తారు, అయితే ఎవరూ వెళ్ళలేదనుకో.

అనగనగా వినగా వినగా కొన్నాళ్ళకు, ఆ ఊరి బ్రాహ్మణాయనకు లేక లేక కలిగిన మొగనలుసు ఊరొదిలి పొరుగూరెళ్ళి పెద్దబడి చదువు చదవడం జరిగింది. దరిమిలాను అయన పినమామగారి పట్టుదల మీద పట్నం వెళ్ళి కాలేజీ చదివాడు. ఆ కుర్రాడి పేరు సుబ్బారావు గామోసు. కాలేజీలో రివాజు ప్రకారం అతగాడూ ఓ చిన్నదాన్ని వలచాడు. వాళ్ళిద్దరూ పాటలు పాడుతూ, డాన్సులు చేస్తూ తిరిగారని చెప్పకునే వారప్పట్లో. తప్పేంలేదు, అందరూ అంతేట. బయస్కోపులో జూళ్ళే! అలాగే! ఏం? చదువులైపోయాక సుబ్బారావు ఇంటికి తిరిగొచ్చాడు, ఒచ్చాక దెలిసింది. తావలసిన చిన్నది తనక్కావలసిన సిన్నది తమ కుటుంబానిక్కావలసిన చిన్నదేనని, వాళ్ళది బురదపాడు.

ఒచ్చిన మూడోనాడే పల్లెటూరి సౌందర్యం, ప్రశాంతత మొఖం మొత్తేవిగాని, అదిగో ఆ పిల్లదాని ఒల్లమాల్న చక్కదనంవల్ల సుబ్బారావు కుదురుగానే ఉన్నాడు. ఎటొచ్చీ రోజూ దాన్ని జూడటానికి షికారెళ్ళి రావడం ఇబ్బందిగా ఉండేది. మూడు మైళ్ల దారీ బురదమయం. గోతులు, ముళ్ళు, బురద ఎండితే ఇహ కొండలూ, లోయలూను. బండి వెళ్ళదు. సైకిల్ని మోసుకు వెళ్ళచ్చు, కాళ్ళలో సత్తా వుంటే. దారిలో కొండంత గడ్డిమేటలు అడ్డు నిలుస్తాయి. వాటికన్న నడచిపోవడమే మెరుగు. కొన్నాళ్ళయే సరికి సుబ్బారావుకి ఛీ అనిపించింది. మనూరికి రోడ్డుండాలన్నాడు. ఉన్నదానికి కంకర పోయిద్దావన్నాడు. తండ్రి నవ్వాడు. తరువాత ఊళ్ళో వాళ్ళదగ్గరా, వీళ్ళ దగ్గరా, కరణమ్మునసబుల దగ్గరా అన్నాడు. రెండేళ్ళాయి పనిచేస్తున్న పంచాయితీకెళ్ళి ప్రెసిడెంటుతో అన్నాడు.

"నీకేవన్నా మతిపోయిందా?" అన్నాడు రెడ్డిగారు.

"అవునబ్బాయి రోడ్డెందుకూ? ఎవరన్నా వింటే నవ్విపోతారు. మనకేవన్నా రాచకార్యాలున్నాయా రోజూ ఊరేగడానికి" అన్నారు మిగతావారు.

"నువ్వా బురదపాడు శాస్త్రుల్లగారి పిల్లను చూట్టానికెళ్ళడం కోసం పెద్దరాదారి వెయ్యాలండం బావుందోయ్. పెళ్ళాడి పారేస్తే పోలా?" అన్నారు కరణంగారు ఒకనాడు సుబ్బారావు ఒక్కడూ వుండగా చూసి. "చనువుకొద్దీ సరదాకన్నానుసుమీ" అన్నారంతలోనే సుబ్బారావు మొహం చూసి చటుక్కున్నాలిక్కరుచుకుని.

సుబ్బారావుకు పౌరుషం వేసుకొచ్చింది. "నలుగురికీ పని కొచ్చేందుకు రోడ్డేయిద్దామంటే, అందులో నా స్వార్థం ఏవిటని జూస్తారెందుకూ!" అని దెప్పి పొడిచాడు అక్కడా అక్కడా మాట్లాడుతూ. ఆ మాట కరణం చెవిన బడింది. తండ్రి ఆ మర్నాడు కొడుకును కేకేసి చివాట్లేశాడు. "పెద్దంత్రం చిన్నంత్రం లేకుండా ఏమిటా వాగుడు? పిల్లకాక్కేం దెల్సు ఉండేల్దెబ్బనీ రోడ్డు పడితే వచ్చే చిక్కులు నీకేం దెల్సు? ఇష్టం లేకపోతే పట్టణం వెళ్ళి ఉద్యోగం అఘోరించు. ఆయనన్నట్టు సమ్మంధం మాటాడతాను. పెళ్ళి చేసేస్తాను. పట్టు" అన్నారు.

సుబ్బారావుకు తిక్క పెరిగిపోయింది. మీరా మీరా అని ఊళ్ళో నలుగురి దగ్గరికీ వెళ్ళి రోడ్డు అవసరం నచ్చజెప్పాడు. రోడ్డు పడితే మన పంటను సులువుగా గూడెం మార్కెట్టుకు తోలుకెళ్ళచ్చు. రోడ్డుపడితే బ్లాకు డెవలప్మెంటు వాళ్ళొచ్చి ఊళ్ళోకూడా రోడ్లేస్తారు. ఎలక్ట్రీ దీపాలు పెడతారు. వారం వారం ఆసుపత్రి కారొస్తుంది, మంచి బడి పెడతారు. రేడియో ఇస్తారు. పుస్తకాలిస్తారు. పత్రికలిస్తారు. మీ పిల్లలంతా చదువుకుని పైకొస్తారు. ఆ రోడ్డు మన అభివృద్ధికి రోడ్డు అవటాని నూరిపోశాడు. ఓపికా తీరికా ఉన్నవారంతా విని తల తాటించేవారు సానుభూతితో "ఆ బ్యామ్మణబ్బాయి రోడ్డోయని దేవుళ్ళాడతన్నాడు పోయించరాదూ" అని ఒకరిద్దరు ప్రెసిడెంటుతో కూడా అన్నారు.

"ఇది బావుంది మద్దిన, ఆ కుర్రాడు సరదా పడతన్నాడని రోడ్డేయించమంటావా? రోడ్డు లేకుండానే ఇప్పటికే చెక్కేం గాఫీసర్ల వల్ల గుడ్లు గూట్లో కొస్తన్నాయి. ఇంక అది కూడా పడితే ఇంకేవన్నా ఉందా? డబ్బెక్కువయిందా?" అన్నాడు ప్రెసిడెంటుగారు నవ్వి.

సుబ్బరాజూ! ఉన్న సంగతదీ. ప్రెసిడెంటూ, కరణమ్మునసబులూ, ఊళ్లో మోతుబర్లూ కూడా ఈ విషయంలో మాత్రం ఒక్క తాటిమీద నిలబడతారు. రెవిన్యూ ఇనస్పెక్టర్లను అళ్ళను ఈళ్ళను ఈ ఊరి కొచ్చినప్పుడల్లా అళ్ళకు విడిది చూపించి మస్తుగా మేపీ, పుష్టిగా తడిపీ, మాట దక్కించుకునీ సాగనంపేసరికి ఊరి పెద్దలకు తాడు తెగినంత పనవుతోంది. దొంగ దాళవాకని కాలవలో కసిని నీళ్ళిప్పి పదెకరా తడుపుతున్నపుడల్లా ఒంతు ప్రకారం అళ్ళనూ, 'తడుపుతూనే' ఉన్నారు. అయితే అళ్ళే అర్నెల్లకో ఏడాదికో ఒచ్చినపుడల్లా ఈళ్ల దాళవాకు నీళ్ళిచ్చినా ఇవ్వకపోయినా ఇచ్చినట్టే లెక్కేస్తున్నారు. ఫీజడుగుతున్నారు. ఆ రాళ్ళా ఈ హద్దులూ ఆ పద్దులూ అంటూ లేనిపోని పేచీలు పెడతన్నారు. సరైన రోడ్లు లేనందువల్ల ఈ గతుకుల్లో గోతుల్లో పడి నడవలేక అస్తమానూ రారు. ఇపుడు రోడ్రుపోయిస్తే అస్తమానూ బండి చేసుకొచ్చేస్తారు. తోచీ తోచనమ్మ తోడికోడలుతో సరసమాడిందని చీటికీ మాటికీ వచ్చేస్తారు. కుటుంబాలతో సహా వచ్చేస్తారేమో కూడా. కాంపులు పదేసి రోజులు వేస్తారు, మొగ పెళ్ళివారికన్న క్రూరులు. పార్టీ

పెద్దలకన్న జబర్దస్తీ చేస్తారు. అంతకన్న ఏనుగుల్ని పెంచొచ్చు. మినిస్టర్లని మేంటేన్ చెయ్యొచ్చు. అప్పాల్చేసే స్నేహితుణ్ణి పెంచుకోవచ్చు. ఈ 'తడుపు సప్లయ్' దెబ్బ ఊరందరికీ తలకాస్తా టెంకి జెల్లంతయినా తగుల్తుంది. నీకు తెలీందేముంది. నేను చెప్పడమేగాని.

కుర్రాయన సుబ్బారావుకీ లుకలుకల్లేలీవు. ఆయన ఎగబడి ప్రచారాలు ఆరంభించాడు.

అందుకు తగ్గట్టే ఒక ఉపద్రవం జరిగింది. సుబ్బారావు తండ్రిగారు ఓ నాడు బురదపాడెళ్ళి వస్తూంటే దార్లో గడ్డిబండి గోతిలో కొరిగి ఆయన మీద పడింది. ఆయన చెయ్యి విరిగింది. మంచాన బడ్డాడు. అక్కడితో కుర్రాయన కావేశం ఎత్తుకొచ్చింది. రోడ్డు లేనందువల్ల గదా ఈ అరిష్టాలు అనుకుని సరాసరి పట్నం వెళ్ళి పయ్యధికార్లతో మాటాడాడు. "మీ ప్రెసిడెంటుతో మాటాడారా? కరణమ్మునసబు లేవన్నారు?" అనడిగాడాయన అదోలా నవ్వి.

సుబ్బారావు ఇంటికొచ్చేసి, తండ్రి మొత్తుకున్నా వినక తెగించి పంచాయితీ ఎల్లక్షనుకు నిలబడ్డాడు. మంచానపడ్డ తండ్రికి ఆపడానికి శక్యంగాక ఊళ్ళో తనవాళ్ళనుకున్న వాళ్ళచేత చెప్పించాడు. అదీ లాభం లేకపోయింది. చివరికి వాళ్ళనే బతిమాలి కొడుక్కు సాయపడమన్నాడు. రోడ్డుమీద అభివృద్ధి మీద అభిమానమెలా ఉన్నా ప్రెసిడెంటు రెడ్డిమీదా, మునసబు కరణాల మీదా గుర్రుకొద్దీ కొందరు సుబ్బారావుకు మద్దతిచ్చి రోడ్డుపడి తీరాలన్నారు. ప్రచారం ముమ్మరంగా జరిగింది.

"ఇదిగో చూశారా? దేశంలోకెల్లా పెద్ద పార్టీ, గవర్నమెంటును నడిపేది ఏవందో చూడండి. మీరు మీ ఓటిస్తే మీ ఊరికి మంచి రోడ్డు పోయిస్తాను" అంటూంది అని ఇంటింటికీ వెళ్ళి చెప్పాడు సుబ్బారావు.

రెడ్డిగారు కూడా ఈ మాటే అన్నారు. "ఆయన మాట విన్నారుగా. జాగర్త. మీరు ఓటిస్తే వాళ్ళు రోడ్డేస్తారుట. జాగ్రత్త" అని హెచ్చరిగ్గా చెప్పాడు.

ఫలితం ఏమిటో వేరే చెప్పక్కర్లేదు. సుబ్బారావు చిత్తుగా ఓడిపోయాడు. అతనికి ఆరంభంలో మద్దతిచ్చిన వాళ్ళు కూడా ఓట్లు రెడ్డికే వేశారు. సుబ్బారావుకి ఒక ఓటూ రానందువల్ల వాళ్ళు కూడ తన పార్టీయేనని రెడ్డికి తెలిసింది. వాళ్ళు ఆనందించారు ముమ్ముందు పేచీలుండవని.

"దేశద్రోహులు. అభివృద్ధి నిరోధకులు, మూర్ఖులు, మీకు బాగుపడే యోగ్యతలేదు" అని ఊరునూ, పెద్దల్నీ తిట్టిపోసి పట్నం లేచక్కాపోయాడు సుబ్బారావు. బెడిసిన సంబంధాలు తను చక్కబెట్టి సర్దుకునేదాకా ఈ ఛాయలకు రావద్దనీ, ఉద్యోగం వెతుక్కోమనీ చెబుతూ డబ్బు పంపించాడు తండ్రి.

☆ ☆ ☆

సుబ్బరాజా రోడ్డు పడడం ఊరుకు మంచిదనీ, లాభసాటి అనీ సుబ్బారావు ఎంత చెప్పినా పెద్దలూ, వార్నిబట్టి ప్రజలూ కూడా విన్నారు గాదు గదా. అతను తిట్టినట్టు వారు ఉభయులూ నిజంగా ద్రోహులేనా? మూర్ఖులేనా? వారిలో ఒకరే ద్రోహులా? ఎవరు నిజమైన ద్రోహులు? సొంత ఇబ్బందులు తప్పించుకుని, అధికార్లను

దూరంగా ఉంచడానికి తాపత్రయపడి ప్రజల్ని అదుపులో ఉంచి చెడుదారి పట్టించిన గ్రామాధికారులా? లేక తమ బాగేదో ఓగేదో కూడా కనుక్కోలేక, కనుక్కున్నా - రోడ్డు పడడంవల్ల ఎన్నో మేళ్ళు జరుగుతాయని తెలిసినా - ఆ అభివృద్ధికి అడ్డుపడేవారికే ఓట్లేసిన ప్రజలా? ఎవరు నిజమైన ద్రోహులు చెప్పు చూదాం" అన్నాడు రామిరెడ్డిగారు కథ నాపుజేసి.

"అభివృద్ధి నిరోధకులు ఆ ఊరి పెద్దలు కారు. ప్రజలంత కన్న కారు. వారివీ వీరివీ కూడా 'అభివృద్ధి వద్దు బాబోయ్' అనిపించేటంతగా 'బాగుపడదారి' అంటే భయపడేటంతగా హడలేసిన అధికార్లూ, వాళ్ళను కట్టుదిట్టం చెయ్యని పై అధికార్లూ, పాలకులూను... వారికే ఆ బిరుదు చెల్లుతుంది" అన్నాడు సుబ్బరాజు.

★ ★ ★